- తెలంగాణ భవన్‌లో బతుకమ్మ సంబురాలు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుక జరుపుకొన్నారు. బతుకమ్మ పాటలతో తెలంగాణ భవన్ హోరెత్తింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ నాయకురాళ్లు ముక్తవరం సుశీలారెడ్డి, మన్నే కవితా రెడ్డి, సామల హేమ, పావని గౌడ్, రమాదేవి, సుమిత్ర ఆనంద్, సరోజ తదితరులు పాల్గొన్నారు. -హైదరాబాద్

చేనేతలను ఆదుకోండి!

- బతుకమ్మ చీరల తయారీలేక ఉపాధి కోల్పోయిన కార్మికులు
- పని కల్పించి చేరదీయాలని ప్రభుత్వానికి డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొంతకాలంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పవర్ లూమ్ కార్మికులను అన్నివిధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నేతన్నలు డిమాండ్ చేస్తున్నారు. తమను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. నేతన్నల ఆత్మహత్యలు నివారించేలా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఏడేండ్లుగా రాష్ట్రంలో బతుకమ్మ చీరల తయారీ అవకాశం కల్పించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకున్న విషయం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని నిలిపివేసింది. దీంతో పవర్‌లూమ్‌పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న నేత కార్మికులకు ఆధారం లేకుండాపోయి రోడ్డునపడ్డారు. ఈ క్రమంలో ప్రభుత్వం తమకు పని కల్పించి ఆదుకోవాలని తెలంగాణ నేత కార్మిక సంఘం నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే తమ డిమాండ్ల సాధనకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.